వ్యాధుల కాలం.. అప్రమత్తతే ప్రధానం

వర్షాలకు అంటువ్యాధులు ప్రబలే అవకాశం

- జాగ్రత్తగా ఉండాలని అధికారుల సూచన
- గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

మహేశ్వరం: ఇటీవల కురిసిన వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అక్కడక్కడ నీరు నిలిచి పరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఫలితంగా అందులో దోమలు, ఈగలు ప్రబలి విష జ్వరాల బారిన ప్రజలను పడేస్తున్నాయి. పారిశుద్ధ్యం, తాగునీరు, ఆహార కలుషితాలతో అంటు వ్యాధులు ప్రబలే ముప్పు ఉంది. దీనికి ఏటా ఆయా వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఆరోగ్య శాఖ, పంచాయతీ అధికారులు ఎంత ప్రయత్నిస్తున్నా అనారోగ్య సమస్యలు చుట్టుముడుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జ్వర సర్వే నిర్వహించి గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. వానాకాలం వ్యాధులు పొంచి ఉండడంతో మరోసారి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అప్రమత్తం కావాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.



తుమ్మలూరులో సిబ్బందితో బ్లీచింగ్ చల్లిస్తున్న పంచాయతీ కార్యదర్శి

ఫ్రై డే- డ్రై డే

యంత్రాంగం వ్యాధుల నివారణకు ప్రణాళికలు రూపొందించి ముందుకు వెళ్తోంది. మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు మురుగు కాల్వలను శుభ్రం చేస్తున్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడం, పెంట కుప్పలు తీయించడంతో పాటు వర్షం నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు. ఆరోగ్య శాఖ అధికారులు ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించి నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్నారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్యులు శిబిరాలు నిర్వహించి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నారు. ఈ పరిణామాలతో పరిస్థితి కొంత అదుపులోనే ఉంది.



మహేశ్వరంలో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేస్తున్న సిబ్బంది

నిరంతరం పర్యవేక్షణ



మండలంలో 31 గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నాం. ఇటీవల స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఐదు రోజులు నిర్వహించాం. మురుగు కాల్వలు, వర్షం నీరు నిల్వ ఉన్న చోట దోమలు వృద్ధి చెందకుండా రసాయనాలు పిచికారీ చేయిస్తున్నాం. పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

– శ్రీలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి, మహేశ్వరం

పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వర్షాకాలం కావడంతో గ్రామాల్లో ప్రజలకు రోగాలు రాకుండా వైద్య శాఖ నుంచి తగు చర్యలు తీసుకుంటున్నాం. వ్యాధుల నివారణపై ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉంది. గ్రామాలు, కాలనీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సూచనలిస్తున్నాం. దుబ్బచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు గ్రామాల్లో ఉన్న ఆరోగ్య కేంద్రాల్లో జ్వర సర్వే నిర్వహించి, రోగులకు మందులు పంపిణీ చేస్తున్నాం.

– పద్మావతి, వైద్యాధికారి, పీహెచ్‌సీ, దుబ్బచర్ల

నియామకం



శివకు నియామకపత్రం అందజేస్తున్న కేఎల్ఆర్

మహేశ్వరం: మహేశ్వరం మండల ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నడికూడ శివ నియమితులయ్యారు. సోమవారం మండల పరిధిలోని తుక్కుగూడలోని కేఎల్ఆర్ కార్యాలయంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఐఎన్‌టీయూసీ నాయకుల ఆదేశాల మేరకు శివను నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం, ఐఎన్‌టీయూసీ నిరంతరం పని చేస్తుందన్నారు. మండలంలో ఉన్న పరిశ్రమలు, కంపెనీలు, కర్మాగారాలలో పనిచేస్తున్న కార్మికుల హక్కుల కోసం తాను నిరంతరం పోరాడుతానన్నారు. ఈ పదవి తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. ఈ బాధ్యతలు అప్పగించిన ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు సామ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ ఎనుగు జంగారెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రవాపు ఇజ్రాయేల్, రాజునాయక్, సేవ్యానాయక్, శశికాంత్‌నాయక్, కార్తీక్, రోహిత్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిన బీఎస్పీ నాయకురాలు



అనితను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేఎల్లార్

బడంగ్‌పేట్: స్థానిక వసంత్‌విహార్ కాలనీకి చెందిన బీఎస్పీ బడంగ్‌పేట్ కార్పొరేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు అనిత సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితురాలై పార్టీలో చేరినట్టు అనిత పేర్కొన్నారు. మహిళల కోసం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తానని ఆమె చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ భవనం వద్ద సెక్యూరిటీ నియామకం



భవనం వద్ద సెక్యూరిటీ గార్డులు

సాక్షి ఎఫెక్ట్..

బడంగ్‌పేట్: మున్సిపల్ కార్పొరేషన్‌లో భద్రత డొల్ల అనే శీర్షికన ఆదివారం వచ్చిన కథనానికి కార్పొరేషన్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కార్పొరేషన్ భవనానికి ప్రహరీ లేని కారణంగా దొంగలు, విలువైన వస్తువులు ట్రాక్టర్లను ఎత్తుకెళ్తున్నారని ప్రహరీని నిర్మించి సిబ్బందితో గస్తీ పెంచాలని సాక్షిలో ప్రచురితమైన విషయానికి స్పందించిన అధికారులు ప్రహరీ పనులు మొదలు పెట్టడంతోపాటు హుటాహుటిన పది మంది సిబ్బందిని సెక్యూరిటీ గార్డులను కాంట్రాక్ట్ బేసిక్‌గా నియమించారు. రెండురోజుల్లో వారికి యూనిఫామ్ అందజేస్తామని, గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని కమిషనర్ రఘుకుమార్ తెలిపారు.


శివాలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శివుడు

తుక్కుగూడ: శ్రావణమాసం రెండో సోమవారం వేడుకలను మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగూడ ఛత్రగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలోని శివాలయంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శివుడికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. భక్తులు స్వామివారికి మొక్కులు, కానుకలు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అజయ్‌శర్మ, మురళీశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కందుకూరు: కందుకూరులోని భూలక్ష్మి ఆస్పత్రి నిర్వాహకుడు, లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డిని లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సోమవారం కందుకూరులో కలిసి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ పాస్ట్ జిల్లా గవర్నర్, మల్టీపుల్ హంగర్, మీల్స్ ఆన్ వీల్స్ చైర్‌పర్సన్ రాధాకృష్ణ మాట్లాడుతూ.. మహేంద్రకుమార్‌రెడ్డి స్థానికంగా వైద్యసేవలతో పాటు లయన్స్‌క్లబ్ ద్వారా పేదలకు ఎంతో సేవచేస్తున్నారని కొనియాడారు. క్రమం తప్పకుండా రక్తదానం చేస్తూ ప్రభుత్వం నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తుండటం అభినందనీయమన్నారు. ఆయన సేవలతో లయన్స్‌క్లబ్‌కు మరింత పేరు ప్రతిష్టలు పెరిగాయన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ తాళ్ల అంజయ్య, నాగర్‌కర్నూల్ క్లబ్ కోశాధికారి నాగరాణి, స్థానిక క్లబ్ అధ్యక్షుడు ఎస్.విఠల్‌రెడ్డి, సెక్రటరీ టి.జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారి కె.వెంకటేశ్వర్‌గుప్తా, ఆస్పత్రి సిబ్బంది సామేల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న పీఆర్టీయూ నాయకులు

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్

కందుకూరు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చొరవ చూపాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్ కోరారు. సోమవారం మండల పరిధిలోని పలు జెడ్పీ పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరువుభత్యంతో పాటు ఫిట్‌మెంట్ 50 శాతం ప్రకటించాలన్నారు. తక్కువ మంది విద్యార్థులు ఉన్న చోట ఎక్కువ మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, వారిని గుర్తించి తక్కువ ఉన్నచోటకు బదిలీ చేయాలన్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. జీఓ నంబర్ 11, 12 సవరించి బీఈడీ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పీఎస్‌హెచ్ఎం పోస్టులు కల్పించాలని, పదివేల పీఎస్ హెచ్ఎం పోస్టులు వెంటనే ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గుడిసెల బుచ్చయ్యగుప్తా, దేవేందర్ నాయక్, సల్మాన్, గోవర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యానారాయణరెడ్డి, లక్ష్మారెడ్డి, మల్లికార్జున్, హరిప్రసాద్, రాముగౌడ్, జయసింహారెడ్డి పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి సూచించారు. షాలోమ ఆఫ్ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆదిబట్ల ఠాణాలో డ్రగ్స్ నివారణ వాల్ పోస్టర్‌ని సీఐ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఎక్కువగా విద్యార్థులు ఇలాంటి చెడు వ్యసనాలకు బానిసలై పోతున్నారన్నారు. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాయన్నారు. వీటి నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పౌరుడు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం పోలీసులకు సహకరించాలని కోరారు. డ్రగ్స్‌కు బానిసై జీవితాలను పాడు చేసుకోవద్దన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి పోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ నివారణ కోసం స్వచ్ఛంద సంస్థ పని చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కె.అశోక్, గౌరవ అధ్యక్షులు పెంటమ్మ, జంగయ్య, ఎస్ఐ రాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి

కడ్తాల్: పంటలు ఎండిపోకుండా మండలంలోని మద్దెలకుంట తండాలో 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాత్కాలికంగా ఏర్పాటు చేయాలని సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తండా రైతులతో కలిసి ఏఈ నరేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. రావిచేడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని మద్దెలకుంట తండాలో వ్యవసాయానికి విద్యుత్ సమస్యలు తలెత్తుతుండటంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయన్నారు. ఇటీవలే విద్యుత్ సమస్యను పరిష్కరించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు రైతులు 16 డీడీలు సైతం చెల్లించారన్నారు. దీనికి అధికారులు స్తంభాలు మాత్రమే మంజూరు చేసి, పూర్తిస్థాయిలో సామగ్రిని పంపలేదన్నారు. దీంతో పనులు పూర్తయ్యే వరకు పంటలు ఎండిపోకుండా తాత్కాలికంగా తండాలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు భాస్కర్, శ్రీను, శంకర్, రవి, డాక్య, బాలు, వాచ్య, హన్మా తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్, రైతులు

గ్రామాల్లో సీపీఎం నేతల పర్యటన

మంచాల: ప్రజా సమస్యలను గుర్తించేందుకు సీపీఎం నాయకులు గ్రామాల్లో పర్యటిస్తున్నారని పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యుడు సిలివేరు రాజు తెలిపారు. ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు గ్రామాల్లో సమస్యలు తెలుసుకుంటున్నారన్నారు. సోమవారం మండలంలోని ఆంబోత్ తండాలో నాయకులు పర్యటించారు. రేషన్ కార్డులు, పారిశుద్ధ్య, పింఛన్లు, భూసమస్యలు, ఆర్టీసీ బస్సుల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు తెలిపారు. రవీందర్, సురేశ్, రాజేశ్, గోవింద్, సాయి, విఘ్నేశ్, నితిన్ పాల్గొన్నారు.



మురుగు నీటిని పరిశీలిస్తున్న నాయకులు

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

అదనపు డీఎస్పీ ఎస్ఓటీ నర్సింహారెడ్డి

బడంగ్‌పేట్: నాయకత్వ లక్షణాలు పాఠశాలల నుంచే అలవర్చుకోవాలని అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్ఓటీ రాచకొండ కమిషనరేట్ డాక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం సాగర్‌రోడ్డులోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో కేబినేట్ ఇన్‌స్టాలేషన్ (2024-25) కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా అడిషనల్ డిప్యూటీ కమిషనర్ నర్సింహారెడ్డి హాజరయ్యారు. కేబినేట్ మెంబర్లుగా ఎన్నికైన హౌస్ మెంబర్లకు నర్సింహారెడ్డి బ్యాడ్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకత్వ లక్షణాలు పాఠశాల స్థాయినుంచే విద్యార్థులు పెంపొందించుకునేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకత్వ లక్షణాలతో యూనిటీపై పట్టు, దేశభక్తి, పటిమ, కమాండింగ్, ఏకాగ్రత, మానసిక శారీరక ధైర్యం, ఆలోచనా భావాలు పెంపొందుతాయన్నారు. ఎన్నికైన విద్యార్థినులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, నిహారికరెడ్డి, ప్రిన్సిపాల్ పీఎస్ఎల్ రత్నమాల, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

దిల్‌సుఖ్‌నగర్: భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రాంతికుమార్ అన్నారు. సోమవారం ఆర్కేపురం ఎన్టీఆర్‌నగర్‌లో ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. క్రాంతికుమార్ మాట్లాడుతూ శాస్త్రీయ సోషలిజమే గమ్యంగా, ప్రభుత్వ విద్య, సెక్యులరిజం, ప్రజాస్వామ్య పరిరక్షణే కర్తవ్యంగా ఏఐఎస్ఎఫ్ ఉద్యమిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వంశీవర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు అరుణ్, సరూర్‌నగర్ మండల అధ్యక్ష కార్యదర్శులు బాతరాజు భవానీ, పి.వినోద్, సహాయ కార్యదర్శి రేణుక, కార్యవర్గ సభ్యులు ఉష, భాగ్య, శ్వేత, నికిత, అరవింద్, వేణు తదితరులు పాల్గొన్నారు.

వరద పైపులైన్ నిర్మాణ పనుల పరిశీలన

వనస్థలిపురం: అభివృద్ధి పనుల విషయంలో కాంట్రాక్టర్లు నాణ్యతాప్రమాణాలు పాటించేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని హైకోర్టు కాలనీలో జరుగుతున్న వరదనీటి పైపులైన్ నిర్మాణం పనులను అధికారులతో కలసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలనీలలో వరద కాలువలలో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ దామోదర్, ఏఈ చంద్రశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం అందజేత

తలకొండపల్లి: మండలంలోని గట్టుఇప్పలపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి రూ.పది వేల విరాళం అందజేశారు. ఈ మేరకు సోమవారం నగదును ఆలయ కమిటీ సభ్యులకు ఇచ్చారు. కార్యక్రమంలో భాస్కర్, ప్రశాంత్‌రెడ్డి, అంజయ్య, జాన్, నరసింహ, రమేశ్, మహేశ్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సాయం అందించడంలో వెనుకంజ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

కందుకూరు: గత ప్రభుత్వంతో పోల్చితే ప్రస్తుత ప్రభుత్వం నిరుపేదలకు సాయం అందించడంలో వెనుకంజలో ఉందని స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని 66 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.17.50 లక్షల చెక్కులను మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ లాంటి పథకాన్ని చిన్నచూపు చూడకుండా ఎక్కువ నిధులు కేటాయించి పేదలకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి ఆమె సూచించారు. నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా తనవంతు కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు టి.ఇందిర, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ విజేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు తాళ్ల కార్తీక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జి.సామయ్య, మాజీ సర్పంచ్‌లు రామకృష్ణారెడ్డి, గోవర్ధన్, కాకి ఇందిరదశరథ, జ్యోతిచంద్రశేఖర్, నందీశ్వర్, దేవేందర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఆర్.ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్లు ఎస్.శేఖర్ రెడ్డి, పి.ఆనంద్, మాజీ డైరెక్టర్లు ప్రకాశ్‌రెడ్డి, పి.పాండు, దేవీలాల్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్స్ యూనియన్ ఏర్పాటు

తుక్కుగూడ: మున్సిపాలిటీలో ఆటో డ్రైవర్లు సూరంగుట్ట ఆటో డ్రైవర్స్ పేరుతో నూతన యూనియన్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్స్, ఏఐటీయూసీ నాయకులు కలిసి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో కార్మిక సంఘం జెండాను ఎగురవేశారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దత్తునాయక్, రామాస్వామి, జైపాల్‌రెడ్డి, చందుయాదవ్, నరేందర్, సురేశ్, లాలు నాయక్, రాజు, భాను, నర్సింహా పాల్గొన్నారు.



కార్మిక జెండాను ఆవిష్కరిస్తున్న ఆటో డ్రైవర్స్, ఏఐటీయూసీ నాయకులు

గిరిజన హక్కులను కాపాడుకోవాలి

వనస్థలిపురం: ఐక్య ఉద్యమాల ద్వారా గిరిజన హక్కులను కాపాడుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.గోపీనాయక్ అన్నారు. ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా సోమవారం ఎల్బీనగర్‌లోని ఆటో స్టాండ్ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉచిత బస్సు పథకం అమలు చేయడంతో ఆటోడ్రైవర్లకు కిరాయిలు దొరక్క ఇంటి అద్దె, స్కూలు ఫీజులు కట్టలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేలు ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విస్మరించిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు అంగోత్ శ్రీను, రమావత్ రాములు నాయక్, పాండు నాయక్, జైపాల్ నాయక్, మంగ్య, శంకరయ్య, అనిల్, హన్మ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

హస్తినాపురం: దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి వనస్థలిపురం సీఐ వై.అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... విద్యానగర్, శాతావాహన యూనివర్సిటీ పక్కన విజయపురి కాలనీ కరీంనగర్ పట్టణానికి చెందిన ఎదునూరి అనిల్‌కుమార్ (37) బౌన్సర్ (ప్రైవేట్ సెక్యూరిటీ)గా పనిచేస్తూ సరూర్‌నగర్ పోస్టాఫీస్ దగ్గర ఇల్లు అద్దెకు తీసుకుని నివసిస్తున్నాడు. ఈ నెల 6న రాత్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌జీవోస్ కాలనీలోని తాళం వేసి ఉన్న టైలర్‌షాపు తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డాడు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా అనిల్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు ప్రాంతాలు, తిరుమలగిరి, చైతన్యపురి, జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కొక్క దొంగతనానికి పాల్పడినట్లు అంగీకరించాడు. అనిల్‌కుమార్‌ను సోమవారం అరెస్ట్ చేసిరిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

సమస్యలపై అలుపెరగని పోరాటం

కడ్తాల్: ఉపాధ్యాయ సమస్యలపై టీఎస్ యూటీఎఫ్ నిరంతర పోరాటం చేస్తుందని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్ర భవనం ప్రాంగణంలో సోమవారం జాతీయ ఉపాధ్యాయ సంఘం (ఎస్టీఎఫ్ఐ) జెండావిష్కరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గోపాల్ నాయక్ మాట్లాడుతూ.. టీఎస్ యూటీఎఫ్ నిరంతరం ప్రభుత్వ విద్యారంగ వికాసం, ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల సాధనకు అలుపెరగని పోరాటం సాగిస్తుందని గుర్తు చేశారు. అదే విధంగా ఎస్టీఎఫ్ఐ దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మల్లయ్యగౌడ్, ఉపాధ్యక్షురాలు కౌసల్య, సీనియర్ నాయకులు భాగ్యలక్ష్మి, రవీందర్‌రెడ్డి, బుచ్చమ్మ, నర్సింగ్‌రావు, మూర్తి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.